క్లుప్తంగా

దీపాదాస్‌ను కలిసిన దళ్‌సింగ్


మున్షీకి బొకే అందజేస్తున్న దళ్‌సింగ్

ఇల్లెందు: ఏఐసీసీలు నేత దీపాదాస్ మున్షీ, రోహిత్ చౌదరిలను ఇల్లెందు కాంగ్రెస్ నాయకుడు భూక్యా దళ్‌సింగ్‌నాయక్ సోమవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి సత్కరించారు. అనంతరం ఇల్లెందు నియోజకవర్గంలో తమ సామాజిక వర్గం అత్యధిక ఓటర్లు ఉన్నా తమకు కాదని ఆదివాసీలకు సీటు కేటాయిస్తే పార్టీ గెలుపుకు తమ శక్తి మేరకు కృషి చేశామని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి పార్టీ తగు న్యాయం చేయాలని కోరారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఎన్నిక


అధ్యక్షుడు రాంబాబు

పాల్వంచ: పాల్వంచ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాపర్తి రాంబాబును ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బానోతు శివ, ప్రధాన కార్యదర్శిగా కటికోజ్వల చిరంజీవిలను ఎన్నుకున్నారు.

జీతాలు పెంచండి


రామానాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న డ్రైవర్లు

టేకులపల్లి: జీతాలు పెంచాలని కోరుతూ టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు బానోతు రామానాయక్‌కు తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ (టీపీఏఎం డబ్ల్యూయూ ఇఫ్టూ) టేకులపల్లి బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డ్రైవర్లు వినతిపత్రం అందజేశారు. అనంతరం టేకులపల్లి బ్రాంచి అధ్యక్షుడు లాకావత్ నరేష్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా జీతాలు పెరగలేదని, పెరిగిన నిత్యావసర ధరలకు కార్మికులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కారదర్శి మదార్, రఘు, రామకోటి, రవి, రాజేష్, గణేష్, సారయ్య, వీరు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల్లో హెచ్చరిక బోర్డులు


బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

చుంచుపల్లి: మండలంలోని విద్యానగర్ గ్రామ పంచాయతీలోని సర్వే నంబరు 137/1, 137/3 – 137/9లో గల 18 ఎకరాల భూమి కోర్టు వివాదంలో ఉన్నందున ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఆ భూములను పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వివాదంలో ఉన్న ఆ 18 ఎకరాల్లో రాజకీయ నాయకుల అండదండలతో మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. కోర్టు తీర్పు వచ్చేవరకు ఎటువంటి నిర్మాణాలు చెపట్టవద్దని తెలిపారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న వాటికి నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు.

రిటైర్డ్ కార్మికుల నుంచి రికవరీ చేయొద్దు


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): కోల్ పెన్షన్ స్కీమ్‌ను సవరించడమే కాక ఏరియా ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటే రిటైర్డ్ ఉద్యోగుల నుంచి చేస్తున్న రికవరీని నిలిపివేయాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... కంపెనీ ఆస్పత్రిలో చికిత్స చేసి నగదు మినహాయించుకోవడం సరికాదన్నారు. అలాగే, తక్కువ పింఛన్‌తో జీవనం కష్టంగా మారినందున అభయహస్తం పరిధిలోకి వచ్చేలా యాజమాన్యం చర్యలు చేపట్టాలని కోరారు.



జై..రామ్‌లల్లా

ఆలయాల్లో మార్మోగిన రామ నామస్మరణ

అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం కొత్తగూడెం ఇల్లెందు నియోజకవర్గాల్లో జై.. రామ.. జైజై.. రామ నామస్మరణ మార్మోగింది. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పది గంటల నుంచి భక్తులు ఆలయాల్లో శ్రీరాముడిని స్మరిస్తూ భజనలు చేశారు. శ్రీరామ కీర్తనలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. పలు గ్రామాల్లో శ్రీరాముడి శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిపారు. ఆలయాల్లో, కూడళ్లలో అయోధ్యలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠను వీక్షించే విధంగా భారీ ఎల్‌ఈడీ తెరలతో లైవ్ ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. రహదారుల వెంట, వీధుల్లో, ఆలయాల వద్ద బెల్లం పానకం, తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. పలువురు ఇంటిపై రాముడు, ఆంజనేయ స్వామి ఉన్న కాషాయ జెండాలను ఎగురవేశారు. సాయంత్రం మహిళలు ఇళ్లల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు, – సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంటౌన్: శ్రీరామాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు


ఇల్లెందు: రాందేవ్‌బాబా ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, చైర్మన్ డీవీ


నంబర్-2 బస్తీ రామాలయంలో..


కొత్తగూడెంరూరల్: తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్


చుంచుపల్లి: రుద్రంపూర్ రామాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామికి లక్ష తులసీ దళార్చన...


కొత్తగూడెంటౌన్: బాబుక్యాంప్‌లోని శ్రీరామాలయంలో...


రైల్వే స్టేషన్ రామాలయంలో భక్తులు


భజనమందిరంలో సామూహిక కుంకుమార్చన


ఇల్లెందురూరల్: మామిడిగూడెంలో సీతారాములకు పూజ చేస్తున్న యువతులు


కొమరారం రామాలయంలో అన్నదానం


జూలూరుపాడు: పాపకొల్లు రామాలయంలో..


సుజాతనగర్‌లో ఊరేగింపు


పాల్వంచరూరల్: రంగాపురంలో ఇంటింటికీ లడ్డూ ప్రసాదాల పంపిణీ


టేకులపల్లి రామాలయంలో ఎల్‌ఈడీ తెరపై వీక్షిస్తున్న భక్తులు


దీపాలు వెలిగిస్తున్న భక్తులు

శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి

పాల్వంచ: మున్సిపాలిటీల్లోని శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక బంజరా కాలనీ ఏరియాలో విద్యుదీకరణకు సీడీఎస్ నిధులు రూ.17.20 లక్షలతో రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, 73 కరెంట్ పోల్స్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఈ లక్ష్మణ్, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు ఎస్‌కే సాబీర్‌పాషా, రంగారావు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఓసీ ప్రభావిత ప్రాంతంగా గుర్తించండి..

ఇల్లెందురూరల్: సింగరేణి యాజమాన్యం త్వరలో ప్రారంభిస్తున్న జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంపై స్పష్టత ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని, 21పిట్ ఏరియా మొత్తాన్ని ప్రభావిత ప్రాంతంగా గుర్తించేలా సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్యకు 21పిట్ పరిరక్షణ కమిటీ సోమవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. జేకే ఓసీ నిర్వాసిత ప్రాంత సర్వే కొంత పూర్తి చేసి కొన్ని ప్రాంతాలను నిర్లక్ష్యంగా వదిలేసిందని వాపోయారు. కనీసం సంస్థ నిర్దేశించిన వంద మీటర్ల పరిధిలో కూడా సర్వేకు ముందుకు రావడం లేదని ఆరోపించారు. ఓసీ పనులు ప్రారంభమైతే సంస్థ చేపట్టే బ్లాస్టింగ్‌లతో తమ ఇళ్లు నేలమట్టమయ్యే పరిస్థితి ఉందన్నారు. నిర్వాసితుల సమస్యలను గుర్తించి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి తమ ప్రాంతానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ఎంపీటీసీ పూనెం సురేందర్, నబీ, మంచాల వెంకటేశ్వర్లు, వడ్ల శ్రీనివాస్, ధనసరి రాజు, క్లింట్ రోచ్, ఎట్టి హరికృష్ణ, రెంటాల సదా, శ్రీను, గూళ్ల సదా, లాలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న కామేష్

చుంచుపల్లి: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జ్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్ కాలనీలో జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్యానగర్, బాబుక్యాంప్, ఎన్‌కే నగర్, బాదావత్ తండా గ్రామాల్లో కొంతమంది రాజకీయ నాయకులు, బడా వ్యాపారులు రాజకీయ అండదండలతో చట్టాలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రం తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయి, మాలోత్ వీరు నాయక్, అసెంబ్లీ అధ్యక్షుడు చేనిగరపు నిరంజన్ కుమార్, వంగా రవిశంకర్, పోలే కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్లు ఆవిష్కరణ

ఇల్లెందు: వనపర్తి జిల్లా కేంద్రంలో ఈ నెల 28న జరగనున్న పంచాయతీ కార్మికుల రాష్ట్ర మహాసభ ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ కోరారు. ఈ మేరకు సోమవారం ఇల్లెందులో ఇఫ్టూ సమావేశంలో పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు. పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ చట్టాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాయం వెంకన్న, గోపీ, శ్రీకాంత్, పెద్దులు, చిట్టిబాబు, ముత్తమ్మ, శ్రీదేవీ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పీఆర్‌టీయూ క్యాలెండర్లు ఆవిష్కరణ

సుజాతనగర్: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ–టీఎస్) 2024 క్యాలెండర్లను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం చిట్లూరి వీరభద్రరావు చేతులమీదుగా ఆ సంఘం బాధ్యులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘం ఆధ్వర్యంలో కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుబ్బారావు, జహంగీర్ షరీఫ్, ఎండీ షఫీ అహ్మద్, శ్రీకాంత్, కుమారస్వామి, జీవీ, సునీత, శ్రీవాణి, చంద్రమౌళి పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్


ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 70 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఈనెల 27న జరిగే మండలస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, గురుమూర్తి, రామనాథం, ఉమామహేశ్వరి, లలిత పాల్గొన్నారు.

మా కృషితోనే ఆన్‌లైన్‌లో సీఎంపీఎఫ్..

సింగరేణి(కొత్తగూడెం): అఖిల భారతీయ ఖదాన్ మజ్దూర్ సంఘ్ (ఏబీకేఎంఎస్), బీఎంఎస్ నిరంతర పోరాటాల ద్వారానే సింగరేణిలోని కార్మికుల సీఎంపీఎఫ్ లెక్కలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని సంఘం నాయకుడు పి.మాధవనాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. సీఎంపీఎఫ్ పనితీరును పటిష్టం చేయటమే కాకుండా వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నారని, తద్వారా కార్మికులు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చని పేర్కొన్నారు.

పట్టభద్రులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

పాల్వంచరూరల్: వచ్చే నెల 6వ తేదీ నాటికి పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 2020 అక్టోబర్ నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఆన్‌లైన్ గానీ నేరుగా తహసీల్‌లో ఫారం18 పూర్తి చేసి ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు, డిగ్రీ ఉత్తీర్ణులైన ధృవీకరణ పత్రాలను జత చేసి అందజేయాలని తెలిపారు.

ప్రచార రథం ప్రారంభం

ఇల్లెందు: మైనార్టీ గురుకుల కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలకు ఊరూరా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మూడేళ్ల క్రితం ప్రారంభమైన మైనార్టీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో అన్ని వసతులు కల్పించి మేలైన విద్యా బోధన అందిస్తోంది. అయినా తగినంత మంది విద్యార్థులు చేరడం లేదు. ఈసారి అన్ని సీట్లు భర్తీ చేయాలని యాజమాన్యం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డీవీ ప్రచారం రథాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ బైపీసీ 40, ఎంపీసీలో 40 సీట్లు ఉన్నట్లు చెప్పారు. 30 మైనార్టీ, బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీలకు 2 , ఓసీలకు ఒక సీటు కేటాయించినట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరానికి ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం...

ఇల్లెందు: గత ఎన్నికల్లో అధికార పార్టీ ఎన్ని విధాలుగా ప్రలోభాలు పెట్టినా ముస్లింలు తన వెనకే ఉన్నారని వారిని విస్మరించబోనని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం ఇల్లెందు పట్టణంలోని యాకుబ్ సేట్ మామిడితోటలో పట్టణ ముస్లిం సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు పేద ముస్లింలకు అందేలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో గౌస్, జానీ, చైర్మన్ డీవీ పాల్గొన్నారు.


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, డీవీ, ప్రిన్సిపాల్

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో...

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను అంగన్‌వాడీలు ఘనంగా సత్కరించారు. ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు పరిధిలోని టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల పరిధిలోని 104 మినీ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లను మెయిన్ టీచర్లుగా, టేకులపల్లి 48, గుండాల 19, ఆళ్లపల్లి 28 కేంద్రాలను సైతం రాష్ట్ర ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీడీపీఓ కేఎం తార ఆధ్వర్యంలో సోమవారం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డులోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మానసభలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, ఎమ్మెల్యేకి శాలువా కప్పి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ అరుణ, సర్పంచ్‌లు మాలోతు సురేందర్, అజ్మీర బుజ్జి, వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: రాష్ట్రంలోని టీచర్లకు పదోన్నతులలో టెట్ తప్పనిసరి చేస్తే ఉద్యమిస్తామని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ అన్నారు. సోమవారం జెడ్పీహెచ్ఎస్ సులానగర్‌లో హెచ్‌ఎం జి.దేవదాస్, ఏహెచ్ఎస్ కోయగూడెంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బి.బాలరాజు, టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, జెడ్పీహెచ్ఎస్ ముత్యాలంపాడులో హెచ్‌ఎం డి.రామ్‌చందర్ సింగ్ ఫిబ్రవరి 11,12వ తేదీలలో ఖమ్మంలో జరగనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. రాష్ట్రంలో కామన్ స్కూల్ విధానాన్ని తీసుకురావాలని, అసమానతలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత పాలకులు ప్రైవేటు విద్యారంగాన్ని ప్రోత్సహించారని, కొఠారీ కమిషన్ సిఫారసుల ప్రకారం రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ ఈ.ముత్తయ్య, మండల కార్యదర్శులు బి.శ్రీనివాస్, ఎం.శారద తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

టేకులపల్లి: వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ స్కీం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బేతంపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. లింక్ వర్కర్ బి.వరలక్ష్మి మాట్లాడుతూ... ప్రతీఒక్కరు హెచ్ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అసురక్షిత లైంగిక సంబంధాలు కలిగి ఉండటం, కలుషితమైన సూదులు (ఇంజెక్షన్లు) వాడటం, కలుషితమైన రక్త మార్పిడి వల్ల, హెచ్ఐవీ ఉన్న గర్భిణీ నుంచి పుట్టబోయే బిడ్డకు ఇలా నాలుగు మార్గాల ద్వారా హెచ్ఐవీ వైరస్ మానవ శరీరంలో ప్రవేశిస్తుందని తెలిపారు. హెచ్ఐవీ పరీక్షల విధానం, ప్రాముఖ్యత, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. సుఖ వ్యాధులు, క్షయ తదితర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వై.బాబు, కార్యదర్శి దొడ్డా మీనాకుమారి, వీఓఏలు స్వరూప, నాగమణి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వరలక్ష్మి